భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

- ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి
- 32 మందికి భూ పట్టాల పంపిణీ


యాడికిలో భూ పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

యాడికి: దశాబ్దాలుగా రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ భవనంలో మండలంలోని చందన, కోనుప్పల పాడు, గుడిపాడు, కుందనకోట, కమలపాడు, పుప్పాల, వెంగన్నపల్లె గ్రామాల రైతులకు భూ పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం జగన్ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని కొనియాడారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుంచి ప్రజలు ఏ సమస్యలతో ఇబ్బంది పడుతున్నారో తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు ముందుకు సాగుతున్నారని తెలిపారు. గతంలో ఎందరో ముఖ్యమంత్రులను చూశామనీ, చుక్కల, అసైన్‌మెంట్ భూముల సమస్యలపై దృష్టి సారించిన వారు లేరన్నారు. మూడు, నాలుగు దశాబ్దాలుగా అసైన్‌మెంట్ భూములను సాగు చేసుకుంటున్న వారికి ప్రభుత్వం పట్టాలు అందజేస్తోందన్నారు. అయితే ఈ విషయాన్ని సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లడంతో 32 మందికి 31.90 ఎకరాలకు పట్టాలు పంపిణీ చేశామని తెలిపారు.

32 మంది రైతులకు లబ్ధి

చందన, కోనుప్పలపాడు, గుడిపాడు, కుందనకోట, కమల పాడు, పుప్పాల గ్రామాలకు చెందిన 32 మంది రైతులు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు పంపిణీ చేయాలని గత ప్రభుత్వాలకు విన్నవించుకున్నట్లు తెలిపారు. అయితే ఏ ముఖ్యమంత్రి స్పందించిన పాపాన పోలేదన్నారు. చంద్రబాబు భూ సమస్యలపై ఏనాడూ దృష్టి సారించలేదని మండిపడ్డారు. నాలుగున్నరేళ్ల పాటు కనిపించని వారు ఎన్నికలు సమీపిస్తుండటంతో ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, వైస్ ఎంపీపీ చెన్నప్ప, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటరామి రెడ్డి, సీనియర్ నాయకులు బాలా రమేష్ బాబు, భోగాతి బ్రహ్మానందరెడ్డి, ఆయా గ్రామాల నాయకులు దండు రాముడు, బాలగంగయ్య, కమలపాడు మాజీ సర్పంచ్ భీమేశ్వర రెడ్డి, శివకేశవ రెడ్డి, రాజారెడ్డి, డీలర్ భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేయండి

తాడిపత్రి అర్బన్: త్వరితగతిన నిర్మాణాలను పూర్తి చేసి ఆసుపత్రిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి కాంట్రాక్టర్లను ఆదేశించారు. పట్టణంలో నిర్మాణంలో ఉన్న వంద పడకల ఆసుపత్రిని మంగళవారం పరిశీలించారు. పనులను పరిశీలించి ఎప్పటిలోగా పనులు పూర్తి చేస్తారని కాంట్రాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులు నాణ్యతగా చేపట్టాలని సూచించారు. యుద్ధప్రాతిపదిన నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొస్తే సహకారాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థి విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి గంగులకుంట కేశవరెడ్డి, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నాగరాజు, నాయకులు గోసు రామేశ్వర్‌రెడ్డి, కె.నరసింహారెడ్డి, కాంట్రాక్టర్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వజ్రోత్సవాలు జయప్రదం చేయండి


ఎస్టీయూ క్యాలెండర్ విడుదల చేస్తున్న దృశ్యం

గార్లదిన్నె: కర్నూలు జిల్లాలో ఈనెల 12,13 తేదీల్లో జరగనున్న ఎస్టీయూ 75 వజ్రోత్సవ వేడుకలను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ కోరారు. మంగళవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం వద్ద ఎస్టీయూ డైరీ, క్యాలెండర్, వజ్రోత్సవ వేడుకలకు సంబంధించిన పోస్టర్లను ఎంఈఓలు చంద్రనాయక్, వెంకటరమణ నాయక్ విడుదల చేశారు. ఉపాధ్యాయ సమస్యలపై ఎస్టీయూ పోరాటం చేసిందన్నారు. ఎస్టీయూ వజ్రోత్సవ వేడుకల్లో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు రామక్రిష్ణ, సురేష్, షంషీర్, యాకూబ్, వెంకట చౌదరి, గోపాల్, రామాంజనేయులు, ఉమాదేవి, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు రూరల్: ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి బుధవారం తన క్యాంపు కార్యాలయంలో పింఛన్లు అందజేస్తారని ఎంపీడీఓ వెంకటరమణప్ప మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల వ్యాప్తంగా 6,303 మంది పింఛన్ లబ్ధిదారులు ఉండగా వీరికి రూ.1.88 కోట్లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.

'వైఎస్సార్ బీమా' మంజూరు


వైఎస్సార్ బీమా ప్రొసీడింగ్స్ అందజేస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని 15వ వార్డు సచివాలయ పరిధిలో ఇటీవల మృతి చెందిన నగదాని ప్రేమ్ కుమార్, తపిల రంగనాయకులు కుటుంబాలకు వైఎస్సార్ బీమా పథకం కింద రూ.90 వేల చొప్పున ఆర్థికసాయం మంజూరైనట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మంజునాథ్ రెడ్డి తెలిపారు. మొదటి విడతలో రూ.10 వేల చొప్పున తక్షణసాయాన్ని ప్రభుత్వం అందజేసినట్లు పేర్కొన్నారు. అనంతరం మృతుల కుటుంబ సభ్యులు స్వప్న, ప్రమీలకు బీమా ప్రొసీడింగ్స్ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ పీరా, వార్డు ఇన్‌చార్జ్‌లు హమాలి రామాంజి, అరటి పండ్ల చంద్ర, సునీల్, ప్రసాద్, షఫీ, కౌన్సిలర్లు వరదరాజులు, కేవీ రమణ, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

బెటాలియన్ అధికారులకు సన్మానం


పదోన్నతి పొందిన అధికారులను సన్మానిస్తున్న కమాండెంట్ గంగాధర్ రావు

బుక్కరాయసముద్రం: మండల పరిధిలోని జంతలూరు వద్ద ఉన్న ఏపీఎస్పీ 14వ బెటాలియన్‌లో పని చేస్తున్న ఇద్దరు అధికారులను కమాండెంట్ గంగాధర్ రావు సన్మానించారు. బెటాలియన్‌లో డీఎస్పీగా పని చేస్తున్న డీవీ రమణమూర్తికి అడిషనల్ ఎస్పీగా పదోన్నతి లభించింది. అలాగే బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న సుభాన్‌వలి సివిల్ ఎస్‌ఐగా ఎంపిక కావడంతో ఇద్దరినీ పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ నాగేశ్వరప్ప, అసిస్టెంట్ కమాండెంట్ రమణమూర్తి యూనిట్ డాక్టర్ కౌసర్ బేగం, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు రాము, నాగేంద్ర, లోకేశ్వర నాయుడు, రామారావు, ఆర్ ఎస్ఐలు బెటాలియన్ పోలీస్ అసోసియేషన్ పెద్దయ్య, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ క్యాంప్ వినియోగించుకోండి


మున్సిపల్ అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్ మల్లికార్జున

గుంతకల్లుటౌన్: జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత మెడికల్ క్యాంప్‌ను బుధవారం తిలక్‌నగర్‌లోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ క్లినిక్‌లో నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున తెలిపారు. ఈ వైద్యశిబిరాన్ని యూహెచ్‌సీ పరిధిలోని వార్డుల ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మంగళవారం యూహెచ్‌సీని ఎంఈ గురప్ప యాదవ్‌తో కలిసి పరిశీలించారు. వైద్య శిబిరం ఏర్పాట్లపై అధికారులు, సిబ్బందికి సూచనలిచ్చారు. శిబిరం నిర్వహణకు సంబంధించి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్వాతి, వైద్యసిబ్బందితో చర్చించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, ఏఈ హరికృష్ణ, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

కసాపురం బ్రిడ్జి విస్తరణకు చర్యలు చేపట్టండి

- రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్‌కు విజ్ఞప్తి చేసిన ఎమ్మెల్యే వైవీఆర్


రైల్వే జీఎం అరుణ్‌కుమార్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లు: పట్టణాభివృద్ధికి అవరోధంగా ఉన్న సమస్యలను పరిష్కరించి అభివృద్ధికి దోహదపడే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన సికింద్రాబాద్‌లో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్, ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ కె.ప్రవీణ్‌కుమార్ రెడ్డి, చీఫ్ ఇంజినీర్ రామకృష్ణను కలిశారు. కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయానికి వెళ్లే మార్గంలో పట్టణంలోని సత్యనారయణ పేట వద్ద ఉన్న రైల్వే వంతెన (గుంతకల్లు-గుత్తి) ఇరుకుగా ఉండటంతో రాకపోకలు సాగించడానికి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నట్లు వివరించారు. ఈ వంతెన విస్తరణకు ఇది వరకే రైల్వే, మున్సిపల్ ఇంజినీర్లతో పాటు ఆర్అండ్‌బీ అధికారులతో సర్వే చేయించి జోనల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లామని గుర్తు చేశారు. హనుమేష్ నగర్‌లోని రోటరీ హైస్కూల్ సమీపంలోని గుంతకల్లు-కల్లూరు రైలు మార్గంలో, మోదీనాబాద్‌లోని పాత ఐటీసీ డిపో వద్ద ఉన్న రైలు మార్గాల్లో ద్విచక్ర వాహనాల రాకపోకలకు ఓవర్ బ్రిడ్జిలు నిర్మించాలని కోరారు. ఇక గుత్తి రైల్వే జంక్షన్ గుండా రాకపోకలు సాగించే పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు హాల్టింగ్ లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రయాణికులను దృష్టిలో ఉంచుకుని ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గుంతకల్లు-ధర్మవరం పాస్ట్ ప్యాసింజర్‌ను తిరిగి ప్రవేశపెట్టి, కాచిగూడ-కర్నూలు మధ్య నడుస్తున్న తుంగభద్ర ఎక్స్‌ప్రెస్ రైళ్లను గుంతకల్లు వరకూ పొడిగించాలన్నారు. విజయవాడ, విశాఖపట్నానికి మరిన్ని రైళ్లను గుంతకల్లు మీదుగా నడపాలని విజ్ఞప్తి చేశారు. కసాపురం వంతెన విస్తరణ పనులకు సంబంధించిన ఫైల్ రైల్వే బోర్డులో ఉందని రైల్వే జీఎం అరుణ్‌కుమార్ చెప్పినట్లు తెలిపారు. ఓవర్ బ్రిడ్జి పనులకు అంచనాలు వేయించి రానున్న బడ్జెట్‌లో ప్రవేశపెట్టడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని వెల్లడించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకుడు సీఎం బాషా తదితరులు ఉన్నారు.

తక్షణసాయం అందజేత


మృతుడి భార్యకు నగదు అందజేస్తున్న దృశ్యం

పామిడి: మండంలోని పీ కొండాపురం గ్రామానికి చెందిన బాలరంగన్న ఇటీవల మృతి చెందాడు. వైఎస్సార్ బీమా పథకం కింద రూ.10 వేల తక్షణ సాయాన్ని మంగళవారం తలవాలకట్ట సచివాలయంలో మృతుడి భార్య సులోచనకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 1వ వార్డు ఇన్‌చార్జ్ ఎం.రంగనాయకులు, సచివాలయ అడ్మిన్ సురేంద్ర, వెల్ఫేర్ అసిస్టెంట్ ఆంజనేయులు, వలంటీర్ నల్లప్ప పాల్గొన్నారు.

నేటి నుంచి ముత్యాల ముగ్గుల పోటీలు

గుంతకల్లుటౌన్: జగనన్న సంక్రాంతి సంబరాల్లో భాగంగా బుధవారం నుంచి పట్టణంలో ముత్యాల ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని, మెప్మా టీపీఆర్ఓ మోహన్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నిర్ణీత షెడ్యూల్ ప్రకారం 3 నుంచి 11వ తేదీ వరకు ఆయా వార్డుల్లో ఈ పోటీలు జరుగుతాయని వెల్లడించారు. ఆసక్తి కలిగిన మహిళలు ఈ పోటీల్లో పాల్గొని బహుమతులు గెలుపొందాలని సూచించారు. ఇతర వివరాలకు మెప్మా సీఓలను సంప్రదించి పేర్లను నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అభివృద్ధి పనులపై చర్చ

పామిడి: పట్టణ గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. పంచాయతీ కార్యక్రమాలు-అభివృద్ధి-వాటి ప్రభావం అంశంపై స్పెషల్ ఆఫీసర్ డి.ప్రభాకర్‌నాయక్ మాట్లాడారు. ప్రభుత్వపరంగా పంచాయతీలో జరిగిన అభివృద్ధి పనులపై గ్రామస్తులతో చర్చించారు. అలాగే గ్రామంలో నెలకొన్న సమస్యలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీ జూనియర్ అసిస్టెంట్లు ఖాజామైనుద్దీన్ చిస్తీ, అబ్దుల్‌హుసేన్ పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

శింగనమల: నియోజకవర్గంలోని శింగనమల, నార్పల మండలాల్లో జరిగే వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ కార్యక్రమాల్లో బుధవారం ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పాల్గొంటారని వైఎస్సార్‌సీపీ నాయకులు ఓ ప్రకటనలో తెలిపారు. శింగనమల ఎంపీడీఓ కార్యాలయం వద్ద 11:30 గంటలకు, నార్పల మండలం కేసేపల్లి గ్రామంలో 12:30 గంటలకు లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తారని పేర్కొన్నారు.

హెల్త్ సెంటర్‌కు కుర్చీల వితరణ

తాడిపత్రి అర్బన్: సీబీ రోడ్డులోని అంబేడ్కర్ నగర్ సమీపంలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక అర్బన్ హెల్త్ సెంటర్‌కు లయన్స్‌క్లబ్ వారు మంగళవారం 40 కుర్చీలు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ గవర్నర్ రమేషనాథ్‌రెడ్డి, ఏజీపీ ఎన్.భాస్కర్ రెడ్డి, లయన్స్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఇంటింటికీ అయోధ్య అక్షింతలు


శింగనమలలో అయోధ్య అక్షింతలను ఇంటింటికీ అందజేస్తున్న ఆత్మారామాలయ కమిటీ సభ్యులు

శింగనమల: మండల కేంద్రంలో ఆత్మారామాలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మంగళవారం అయోధ్య రామమందిరం అక్షింతలు, అయోధ్య రామాలయ చిత్రపటాలను ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆత్మా రామాలయ కమిటీ సభ్యులు జే.రాజగోపాలు, విజయశంకర్‌రెడ్డి, రాంభూపాల్, సురేష్, ప్రదీప్, వెంకటరమణ పాల్గొన్నారు.

పామిడి: పట్టణంలోని భోగేశ్వరాలయంలో మంగళవారం అయోధ్య రామాలయం నుంచి వచ్చిన అక్షింతల పంపిణీకి ఏర్పాట్లు చేపట్టారు. ఆలయ కమిటీ చైర్మన్ ఎస్.మురళీధర్ గుప్తా ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ ప్రధాన అర్చకులు రామేశ్వరశర్మ, చంద్రాచారి, అనిల్ అక్షింతలకు పూజలు చేశారు. అనంతరం అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేసేందుకు చిన్నచిన్న ప్యాకెట్లలో నింపి సిద్ధం చేశారు.

బైక్ రేసింగ్‌లో పాల్గొంటే కఠిన చర్యలు


కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ గౌస్ మహమ్మద్

తాడిపత్రిటౌన్: పట్టణ పరిధిలోని ఆటో నగర్ వద్ద బైపాస్ రోడ్డులో మంగళవారం బైక్ రేసింగ్ చేస్తున్న యువకులకు ఎస్ఐ గౌస్ మహ్మమద్ కౌన్సెలింగ్ ఇచ్చారు. బైక్ రేసింగ్‌కు వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకొవద్దని హితవు తెలిపారు. అలాగే వారి తల్లి దండ్రులను స్టేషన్‌కు పిలిపించి పిల్లలను బాధ్యతాయుతంగా పెంచాలని సూచించారు. పెద్దపెద్ద వాహనాలను కొనిచ్చి పిల్లల జీవితాలను నాశనం చేయొద్దన్నారు. మరోసారి బైక్ రేసింగ్ చేస్తే వాహనాలను సీజ్ చేసి వేలంల్లో అమ్మకానికి పెడతామని హెచ్చరించారు.

7న రెడ్డి ఆత్మీయ సభ


శనగలగూడూరులో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రెడ్డి సంఘం నాయకులు

పుట్లూరు: ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఈనెల 7వ తేదీన అనంతపురంలో నిర్వహించే రెడ్ల ఆత్మీయ సభను విజయవంతం చేయాలని రెడ్డి సంఘం జిల్లా నాయకుడు హనుమంతురెడ్డి, మండల నాయకుడు భీమేశ్వరరెడ్డి కోరారు. మంగళవారం మండలంలోని శనగలగూడూరు, కోమటికుంట్ల తదితర గ్రామాల్లో రెడ్డి సంఘం నాయకులు పర్యటించారు. రాజకీయాలకు అతీతంగా కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు విజయ భాస్కర్‌రెడ్డి, రాకేష్‌రెడ్డి, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధనుర్మాస పూజలు

పామిడి: పట్టణంలోని కన్యకా పరమేశ్వరి, అనంత గజ గరుడ లక్ష్మీనారాయణస్వామి ఆలయాల్లో ధనుర్మాస పూజలు చేపట్టారు. ఆయా ఆలయాల్లోని దేవతామూర్తుల విగ్రహాలను శోభాయమానంగా అలంకరించారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ అభిషేకాలు, అర్చనలు, విష్ణు సహస్ర, స్తోత్ర, భగవద్గీత పారాయణం చేపట్టారు. గోదాదేవి, రంగనాథ స్వామికి హారతి ఇచ్చారు.

యువతి అదృశ్యం


మహాలక్ష్మి

యాడికి: మండల కేంద్రానికి చెందిన లక్ష్మీదేవి కూతురు మహాలక్ష్మి (19) నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పి వస్తానని వెళ్లి తిరిగి రాకపోవడంతో అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గురు ప్రసాద్ రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బంధువులు, తెలిసిన వారి ఇళ్ల వద్ద వెతికినా తన కూతురి ఆచూకీ లభ్యం కాలేదని తల్లి లక్ష్మీదేవి ఫిర్యాదు చేసిందని పేర్కొన్నారు.

'ప్రజలను మభ్యపెడుతున్నారు'

పుట్లూరు: వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ద్వారా మోదీ ప్రభుత్వం చేసిన అరకొర అభివృద్ధిని గొప్పగా చూపిస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారని సీపీఐ మండల కార్యదర్శి పెద్దయ్య విమర్శించారు. మంగళవారం మండలంలోని అరకటివేములలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్తులను ప్రైవేట్ పరం చేయడంతో పాటు డీజిల్ ధరలను పెంచిన కేంద్రం ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని మండిపడ్డారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'తో పేదలకు మేలు


తాడిపత్రిటౌన్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి


యాడికి మండలం రాయలచెరువులో సూచనలిస్తున్న ఎంపీడీఓ లక్ష్మీనారాయణ

తాడిపత్రిటౌన్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు వరమని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. మండలంలోని గన్నెవారిపల్లి కాలనీలో రెండో విడుత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటి వద్దకే వచ్చి పేదలకు వైద్యం అందించే కార్యక్రమం జగనన్న మీ కోసం చేస్తున్నారన్నారు. అలాగే ఆరోగ్యశ్రీ పరిధిని రూ.25 లక్షలకు పెంచడం జరిగిందని పేర్కొన్నారు. అనంతరం 738 మంది వైద్య చికిత్స చేసి, మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రంగరావు, జెడ్పీటీసీ రమణమ్మ, ఈఓపీఆర్డీ జిలాన్‌బాషా, వైద్యులు శ్రీనివాసులు రెడ్డి, యశస్వేని, శశికళ, ప్రభాకర్‌నాయుడు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

యాడికి: మండలంలోని రాయలచెరువు సచివాలయం వద్ద రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వైద్యులు మీనాక్షి, దేవారాజణ, మారుతీ శ్రీనివాసులు రెడ్డి తదితరులు 252 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాయలచెరువు సర్పంచు తలారీ అరుణ, ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, ఈఓపీఆర్డీ వెంకటేశ్వర్లు, కార్యదర్శి అరుణ్ కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు నగేష్, రషీద్, జిలాన్ తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం: మండల పరిధిలోని గోవిందపల్లి సచివాలయం పరిధిలోని జంతలూరులో సర్పంచ్ లక్ష్మీదేవి అధ్యక్షతన మంగళవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష నిర్వహించారు. వైద్యులు 359 మందికి వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సునీత, జిల్లా మలేరియా అధికారి ఓబులు, జగనన్న ఆరోగ్య సురక్షా రాష్ట్ర నోడల్ ఆఫీసర్ శ్రీనివాసులరెడ్డి, మండల డాక్టర్ స్వాతి లక్ష్మి, లక్ష్మిరెడ్డి, వివిధ విభాగాల డాక్టర్లు, ఈఓఆర్డీ దామోదరమ్మ పాల్గొన్నారు.

మరుగుదొడ్ల నిర్వహణ సామగ్రి పంపిణీ

గుంతకల్లు రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచేందుకు అవసరమైన సామగ్రిని ఎంఈఓ సుబ్బరాయుడు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు మంగళవారం అందజేశారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దిన రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్వహణకు చర్యలు చేపట్టిందన్నారు. అందులో భాగంగానే మండలంలోని 89 ప్రభుత్వ పాఠశాలలకు టాయిలెట్లను శుభ్రం చేసేందుకు లిక్విడ్ కిట్‌లు, ఎయిర్ ఫ్రెషనర్లు పంపిణీ చేశారు.

కొనసాగుతున్న 'వికసిత్ భారత్ సంకల్పయాత్ర'

పెద్దవడుగూరు: మండల పరిధిలోని చిన్నవడుగూరు, దిమ్మగుడి గ్రామాల్లో మంగళవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర జరిగింది. ప్రజల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కుళ్లాయిస్వామి, ఎంఈఓ రాముడు సూచించారు. కేంద్ర ప్రభుత్వం అందించిన 17 పథకాలపై అవగాహన కల్పించారు. గ్రామాలను అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం వెచ్చిస్తున్న నిధులను వివరించారు. గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వ ఆసుపత్రిలో అందిస్తున్న సేవలను తెలిపారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ నాగేశ్వరశాస్త్రి, ఏపీయం ఈశ్వరయ్య ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

గొడవలకు వెళ్తే ఉపేక్షించం


మాట్లాడుతున్న ఎస్ఐ గురుప్రసాద్ రెడ్డి

యాడికి: గ్రామంలో అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని ఎస్ఐ గురు ప్రసాద్ రెడ్డి తెలిపారు. మంగళవారం చందన గ్రామంలో పోలీసులు పర్యటించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. మట్కా, పేకాట, సారా జోలికి ఎవరూ వెళ్లరాదన్నారు. గ్రామంలో ఎవ్వరూ గొడవలకు పోకూడదని హెచ్చరించారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం


మర్తాడులో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఆలూరి సాంబశివారెడ్డి

గార్లదిన్నె: మండల పరిధిలోని మర్తాడుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కుళ్లాయప్ప ఇటీవల అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి మంగళవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం నుంచి సాయం అందేలా చూస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నరేంద్రరెడ్డి, ఎంపీటీసీ తిమ్మారెడ్డి, ఓబుళపతి, గోపాల్‌రెడ్డి, సుబ్బరావు, యుగంధర్ రెడ్డి, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

గార్లదిన్నె: మండల పరిధిలోని బూదేడులో బుధవారం ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పర్యటిస్తారని మండల కన్వీనర్ నరేంద్రరెడ్డి, ఎంపీడీఓ విజయభాస్కర్ పేర్కొన్నారు. కొత్తగా మంజూరైన 174 పింఛన్లను లబ్ధిదారులకు అందజేస్తారని తెలిపారు. ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.

ముగిసిన గ్రామస్థాయి క్రీడా పోటీలు


యాడికి ఉన్నత పాఠశాలలో వాలీబాల్‌లో తలపడుతున్న క్రీడాకారులు

యాడికి: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న గ్రామస్థాయి వాలీబాల్ పోటీలు ముగిశాయి. మంగళవారం మండల కేంద్రంలోని ఉన్నత, ఆదర్శ పాఠశాలలో 16 సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేసుకున్న 6 టీములకు వాలీబాల్ పోటీలు నిర్వహించారు. అందులో నగరూరు సచివాలయం, యాడికి-4 సచివాలయాల జట్లు మండల స్థాయి పోటీలకు ఎంపికైనట్లు అధికారులు తెలిపారు. త్వరలో మండలస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తామని ఎంపీడీఓ లక్ష్మీనారాయణ తెలిపారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల పీఈటీలు పాల్గొన్నారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

గుత్తి: పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద మంగళవారం ఆటోలో నుంచి ప్రమాదవశాత్తూ కాలు జారి కింద పడిన ఘటనలో డోన్‌కు చెందిన శ్రీనివాసులు అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. డోన్‌కు చెందిన శ్రీనివాసులు మరో కొంత మంది కలిసి పని మీద ఆటోలో గుత్తికి బయలు దేరారు. అయితే గుత్తిలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద స్పీడ్ బ్రేకర్ వద్ద ఆటోలో నుంచి శ్రీనివాసులు కిందపడ్డాడు. గమనించిన స్థానికులు అతడ్ని ఆసుపత్రికి తరలించారు.

విద్యార్థినికి అభినందన


నగదు అందజేస్తున్న మార్కెట్ యార్డు చైర్మన్ భూమిరెడ్డి సునీతమ్మ

పుట్లూరు: రాష్ట్ర స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో అత్యుత్తమ ప్రతిభ కనబరచి సౌత్ ఇండియన్ సైన్స్ ఫెయిర్‌కు ఎంపికైన విద్యార్థిని అనుహ్యారెడ్డిని శింగనమల మార్కెట్ యార్డు చైర్మన్ భూమిరెడ్డి సునీతమ్మ అభినందించారు. మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థినికి భూమిరెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.10 వేల చెక్కు అందజేశారు. అనంతరం గైడ్ ఉపాధ్యాయురాలు రాజేశ్వరిని సన్మానించారు. కార్యక్రమంలో భూమిరెడ్డి ట్రస్ట్ చైర్మన్, ఎంపీటీసీ భూమిరెడ్డి నాగార్జున రెడ్డి, హెచ్ఎం విజయలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.